

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 08-07-2026 | సంపుటి - 29 | సంచిక -46 | రూ : 4 | పేజీలు: 8


## మరమ్మతులకు వెళ్తే

# మొత్తం కూలే ప్రమాదం



- కాళేశ్వరం పై ప్రభుత్వానికి దురుద్దేశం లేదు
- ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్
- ఎన్‌డీఎస్‌ఏ చెప్పినట్టే చేస్తాం
- ఎల్‌నినోకు కాళేశ్వరంను ముడిపెట్టి రాజకీయం చేస్తున్నారు
- కేసీఆర్‌ది ఆర్థిక ఉగ్రవాద కుటుంబం ఆయన లేఖ రాస్తే మేడిగడ్డపై ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేస్తాం
- ప్రభుత్వాన్ని ఒప్పిస్తే మూడేండ్లు ఆయనకే కాంట్రాక్ట్ ఇస్తాం
- బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టండి: ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్ : ఎల్‌నినో పేరు చెప్పి కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టి, తెలంగాణ ప్రజలకు వాస్తవాలు వివరించాలని ముఖ్యమంత్రి ఎనుములు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులు కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ప్రాజెక్టును సరిదిద్దే ప్రయత్నంలో పొరపాట్లు జరిగితే ఎనలేని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. దీనిపై కనీస అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నులు గోదావరి పాలు కాకూడదు. మూడు బ్యారేజీలతో ఉపయోగముంటే... **తరువాయి 2లో**



# చుక్కలు చూస్తున్న ఓటర్లు!

- **ఎస్ఐఆర్-2002 వివరాలు తెలియక తంటాలు**
- **ఎన్యూమరేషన్ పత్రం నింపడంలో అయోమయం**

హైదరాబాద్: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్‌సర్)లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను నింపడంలో ఓటర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎస్ఐఆర్ 2002 వివరాలు అందుబాటులో లేకపోవడంతో పత్రాలను ఎలా పూరించాలో అర్థమవక, తప్పులు రాస్తే ఓటు పోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

*** క్షేత్రస్థాయిలో సమస్యలు ఇలా...**

- ఎన్యూమరేషన్ పత్రంలో ఎస్ఐఆర్ 2002 వివరాలను ఏ బాక్సులో నింపాలి. ఎలా నింపాలి?
- ఒకవేళ 2002లో ఓటరుగా నమోదు అయితే ఆ వివరాలను ఎలా సేకరించాలి?
- చాలామంది ఓటర్లు పట్టణాలు, జిల్లాలు, రాష్ట్రాలు మారారు. అప్పటివివరాలు అందుబాటులోలేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఏంచేయాలి?
- ఆన్‌లైన్‌లోవివరాలు తీసుకుందామంటే ఓటరు పేరు నమోదుచేస్తే ఎస్ఐఆర్ 2002తో మ్యాచ్ కావడంలేదు.
- నగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో వందల్లో పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. ఏ బూత్‌లో ఓటు ఉందో వెతకడం ఇబ్బందికరంగా మారుతోంది.
- చాలామంది ఓటర్ల చిరునామాలు మారాయి. ప్రస్తుతమున్న ఇళ్లకే కొత్త ఇంటినంబర్లు వచ్చాయి. పోలింగ్‌బూత్‌ల కేంద్రాలు, నంబర్లు మారాయి.
- కీలకం... ఎస్ఐఆర్ 2002 వివరాలు

**తరువాయి 2లో**

# మెల్‌బోర్న్‌లో మోదీ సందడి

## భారతీయుల భారీ స్వాగతం




- ఈ వారం ఆస్ట్రేలియాలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- మెల్‌బోర్న్‌లో జరగనున్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు
- ఈవెంట్‌కు 30,000 మంది వస్తారని అంచనా వేస్తున్న అధికారులు
- భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు విలువలపై ఆధారపడ్డవని చెప్పిన హైకమిషనర్

## కాళేశ్వరంలో..

# ఉపయోగపడింది 55 టీఎంసీలే

- కుంగిన, లోపాలు ఉన్న బ్యారేజీల్లో భారాస నాయకులు నీటిని నింపాలంటున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో త్వరలో తుమ్మిడిహెట్టికి..
- ప్రజాప్రతినిధులకు ఇచ్చిన ప్రజంటేషన్‌లో మంత్రి ఉత్తమ్




హైదరాబాద్: ప్రపంచంలో గొప్ప ప్రాజెక్టు..ఎనిమిదో వింత అని చెప్పిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద ఐదేళ్లలో ఉపయోగపడింది 55 టీఎంసీలేనని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల ప్రస్తుత స్థితిపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అవగాహనా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. "ఐదేళ్లలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌ల ద్వారా 165 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. ఎగువ నుంచి వరద వస్తే తిరిగి 63 టీఎంసీలు దిగువకు వదిలేశారు. ఇతర నష్టాలు పోను ఐదేళ్లలో **తరువాయి 2లో**

# తాలిబాన్ కీలక ప్రకటన

## అమెరికాపై మండిపాటు..

# భారత్‌కు స్నేహహస్తం!



- బగ్రామ్ ఎయిర్‌బేస్ తిరిగి ఇవ్వడం కల మాత్రమేనన్న తాలిబన్లు
- ట్రంప్ డిమాండ్‌ను తిరస్కరించిన ఆఫ్ఘన్ మంత్రి
- సరిహద్దు ఉద్రిక్తతలపై పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరిక
- భారత్‌తో వాణిజ్య సంబంధాలు పెంచుకోవడానికి సిద్ధమన్న తాలిబన్లు

**2లో**

# మహారాష్ట్రలో భారీ వర్షాలు






## భారత్-ఇండోనేషియా

# రక్షణ ఒప్పందం

## భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్

- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం
- సుమారు రూ.1900 కోట్లతో డీల్
- ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా
- ఆస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు
- భారత్, రష్యా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణి అభివృద్ధి

# మరమ్మతులకు వెళ్తే.. మొత్తం కూలే ప్రమాదం

హైదరాబాద్ : ఎల్‌నినో పేరు చెప్పి కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టి, తెలంగాణ ప్రజలకు వాస్తవాలు వివరించాలని ముఖ్య మంత్రి ఎనుములు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులు కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ప్రాజెక్టును సరిదిద్దే ప్రయత్నంలో పొరపాట్లు జరిగితే ఎనలేని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. దీనిపై కనీస అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నులు గోదావరి పాలు కాకూడదు. మూడు బ్యారేజీలతో ఉపయోగముంటే... రాత్రింబవళ్లు అక్కడే ఉండి పూర్తి చేసేవాళ్లం. నిజంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అసహనంగా ఉన్నాం...' అని సీఎం వివరణ ఇచ్చారు. కాళేశ్వరంపై చేసిన రూ.97 వేల కోట్ల అప్పులో ఇప్పటి వరకు 33,574.11 కోట్లు తిరిగి చెల్లించామని చెప్పారు. 30 నెలల్లో తమ ప్రభుత్వం 1.80 లక్షల కోట్లు అప్పుచేయగా, రూ.2.08లక్షల కోట్లను తిరిగి చెల్లించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వారి హయాంలో చేసిన రూ.8లక్షల కోట్ల అప్పును వారసత్వంగా ప్రజా ప్రభుత్వానికి అప్పగించిందని గుర్తుచేశారు. అయినా వారు ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకాన్ని ఆపలేదన్నారు. షాదిముబారక్, కళ్యాణలక్ష్మి, రైతు భరోసాతో పాటు పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ మొదలగు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

**కమీషన్ల కోసమే రీ డిజైనింగ్**

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రూ.38 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కమీషన్ల కోసమే కేసీఆర్ రీ డిజైన్ చేసి రూ.81 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఆ తర్వాత ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు పెరిగిందంటూ 'కాగ్' నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. దీనిపై ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ మేడిగడ్డ బ్యారేజ్ నిర్మించినా నిలబడదంటూ నివేదికనిచ్చిందని గుర్తు చేశారు. ఆ నివేదికను తుంగలో తొక్కి వాప్కోస్ ద్వారా తనకు అనుకూలంగా నివేదిక ఇప్పించుకున్నారని విమర్శించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు తన బ్రెయిన్ చైల్డ్ అని కేసీఆర్ చెప్పారు. ప్రారంభించిన ఏడాదిలోనే నిర్మాణ లోపాలు బయటపడ్డాయి. మేడిగడ్డ వద్ద సీసీ బ్లాకులను సరి చేయాలని ఈఈ రమణారెడ్డి 2020లో రాసిన లేఖను పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణ సంస్థ మరమ్మతులు చేపట్టలేదని చెప్పారు. గోదావరి వరదకు 2022లో కన్నెపల్లి పంపుహౌస్‌లు మునిగాయి. పట్టించుకోకపోవడం వల్ల 2023లో కాళేశ్వరం పిల్లర్లు కూలాయి. బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ పరీక్షలు చేయలేదు. ఇసుకమేటలపై నిర్మించడం వల్ల నిల్వ చేసిన నీటి ఒత్తిడికి బ్యారేజీ కుంగింది. నాలుగు పిల్లర్లు కుంగిపోతే ఏమవుతుందని కేసీఆర్ అంటున్నారు. గోదావరి జలాల ఎత్తిపోతలకు మేడిగడ్డ బ్యారేజీ వెన్నుపూస లాంటిది. వెన్నుపూస దెబ్బతింటే చేసేదేమీ లేదు.. నీళ్లు అలా వస్తే.. ఇలా పోతాయి. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి మూడేండ్లలో కట్టిన కాళేశ్వరం కూలింది. వారం రోజులపాటు తమకు ప్రాజెక్టును అప్పగిస్తే నీరు నింపుతానని అంటున్నారు. మిడిమిడి జ్ఞానం ఉన్నవారిని పంపితే ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నాణ్యత లోపం వల్ల కాళేశ్వరం కూలిందని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. ఎవరెన్ని విమర్శలు చేసినా మేం మాత్రం గతంలో జరిగిన తప్పిదాలు చేయకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్తాం...' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఉత్తర తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తున్నదని సీఎం విమర్శించారు. ఎల్‌నినో వల్ల వర్షాలే రాకపోతే.. వరదలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఉద్యమం పేరుతో ప్రజలను మభ్యపెట్టి బీఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ముందున్న కోదండరామ్, ప్రొఫెసర్ యాదగిరి వంటి వారిని దగ్గరకు రానివ్వలేదని గుర్తు చేశారు. 'తాటిచెట్టులా పెరిగితే సరిపోదు.. తలకాయలో గుజ్జు ఉండాలి. నీటిని ఎలా ఒడిసిపట్టాలో తెలియని వారు నీతులు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును నిర్మించారు.

## కాళేశ్వరంలో ఉపయోగపడింది 55 టీఎంసీలే

హైదరాబాద్: ప్రపంచంలో గొప్ప ప్రాజెక్టు.. ఎనిమిదో వింత అని చెప్పిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద ఐదేళ్లలో ఉపయోగపడింది 55 టీఎంసీలేనని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల ప్రస్తుత స్థితిపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అవగాహనా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. "ఐదేళ్లలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌ల ద్వారా 165 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. ఎగువ నుంచి వరద వస్తే తిరిగి 63 టీఎంసీలు దిగువకు వదిలేశారు. ఇతర నష్టాలు పోను ఐదేళ్లలో 55 టీఎంసీలు మాత్రమే వినియోగించారు. కాళేశ్వరం కట్టక ముందు సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ స్టేజ్ 2 కింద ఎన్ని నీళ్లు వచ్చాయో.. కట్టిన తరువాత, కుంగిన అనంతరం కూడా అన్నే నీళ్లు వస్తున్నాయి. నాటి భారాస ప్రభుత్వం కాళేశ్వరాన్ని సరిగా కట్టి ఉంటే ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులకు ఈ దుస్థితి వచ్చేదా? ఈ విషయాన్ని కాంగ్రెస్ శ్రేణులు.. భారాస నాయకులను ప్రశ్నించాలి. భారాస వారే పొరపాటు చేసి తిరిగి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.

## చుక్కలు చూస్తున్న ఓటర్లు..!

హైదరాబాద్: ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్ సర్)లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను నింపడంలో ఓటర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎస్ఐఆర్ 2002 వివరాలు అందుబాటులో లేకపోవడంతో పత్రాలను ఎలా పూరించాలో అర్థమవక, తప్పులు రాస్తే ఓటు పోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

**క్షేత్రస్థాయిలో సమస్యలు ఇలా...**

* ఎన్యూమరేషన్ పత్రంలో ఎస్ఐఆర్ 2002 వివరాలను ఏ బాక్సులో నింపాలి. ఎలా నింపాలి?
* ఒకవేళ 2002లో ఓటరుగా నమోదు అయితే ఆ వివరాలను ఎలా సేకరించాలి?
* చాలామంది ఓటర్లు పట్టణాలు, జిల్లాలు, రాష్ట్రాలు మారారు. అప్పటి వివరాలు అందుబాటులోలేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఏంచేయాలి?
* ఆన్‌లైన్‌లోవివరాలు తీసుకుందామంటే ఓటరు పేరు నమోదుచేస్తే ఎస్ఐఆర్2002తో మ్యాచ్ కావడంలేదు.
* నగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో వందల్లో పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. ఏ బూత్‌లో ఓటు ఉందో వెతకడం ఇబ్బందికరంగా మారుతోంది.
* చాలామంది ఓటర్ల చిరునామాలు మారాయి. ప్రస్తుతమున్న ఇళ్లకే కొత్త ఇంటినంబర్లు వచ్చాయి. పోలింగ్‌బూత్‌ల కేంద్రాలు, నంబర్లు మారాయి.

**కీలకం... ఎస్ఐఆర్-2002 వివరాలు**

ఓటర్ల వద్దకు ఎన్యూమరేషన్ పత్రాలు రావడమే గగనంగా ఉంది. కొన్నిచోట్ల బీఎల్‌వోల ఫోన్‌నంబర్లను తెలుసుకుని వారివద్దకే వెళ్లి పత్రాలను తీసుకోవాల్సి వస్తోంది.

* ఎన్యూమరేషన్ పత్రాల్లో రెండు బాక్సుల రూపంలో కాలమ్‌లు ఉన్నాయి. ఓటరుకు ఎస్ఐఆర్2002లో ఓటు నమోదై ఉంటే... మొదటి బాక్సు కాలమ్‌లో ఆ వివరాలను నమోదు చేయాలి. ఓటరు పేరు, గుర్తింపు కార్డు, జిల్లా, రాష్ట్రం, నియోజకవర్గం సంఖ్య, భాగం సంఖ్య, క్రమ సంఖ్య వివరాలను నింపాలి. అయితే చాలామందికి ఈ వివరాలు తెలియడం లేదు. ప్రధానంగా పట్టణాలు, నగర ప్రాంతాల్లో ఉంటున్న, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డవారికి తమ పాత వివరాలను తెలుసుకోవడం కష్టంగా మారుతోంది. ఈసీఐనెట్ యాప్‌లో, వెబ్‌సైట్‌లో ఎస్ఐఆర్2002 వివరాలను తెలుసుకోవచ్చని ఎన్నికల సంఘం ప్రకటనలు చేస్తున్నా... ఆన్‌లైన్‌లో వివరాలు సక్రమంగా రావడం లేదు. మరోవైపు పేర్లలో చిన్న తేడా ఉన్నా వాటి వివరాలు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు.

## మహారాష్ట్రలో భారీ వర్షాలు

### 13 మంది మృతి.. పలు ప్రాంతాల్లో రెడ్ అలర్ట్

మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలు, బలమైన ఈదురుగాలుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మరణించగా, మరో 10 మంది గాయపడ్డారు. వందకు పైగా ఇళ్లు దెబ్బతినడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం (ఎస్ఈఓసీ) తెలిపింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత అత్యధికంగా ఉంది. పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో గత 48 గంటల్లో ఏకంగా 625 మిల్లీమీటర్ల (24.71 అంగుళాలు) రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాయ్‌గఢ్‌లో 236 మి.మీ., థాణేలో 161 మి.మీ., రత్నగిరిలో 152 మి.మీ., ముంబైలో 100 నుంచి 161 మి.మీ. వరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాల ధాటికి రాష్ట్రంలోని జలాశయాలు వేగంగా నిండిపోతున్నాయి. అంబా, సావిత్రి, కుండలిక, పాతాళగంగ, ఉల్హాస్ సహా పలు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో బద్లాపూర్, మోహనే, జాంభూల్‌పాడ ప్రాంతాల్లో వరద హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా పలుచోట్ల విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఓ భవనం మురికివాడపై కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. చెట్టు కూలి ఒకరు, నీట మునిగి పాల్ఘర్, సింధుదుర్గ్‌లలో చెరొకరు ప్రాణాలు కోల్పోయారు. సతారాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో మాథెరన్, లోనావాలా, ఖోపోలి వంటి హిల్ స్టేషన్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో 'రెడ్ అలర్ట్' ప్రకటించారు. సహాయక చర్యల కోసం రెండు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను మోహరించారు. తలేగావ్‌దాభాడే సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులతో ఉన్న బస్సును ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రాయ్‌గఢ్ జిల్లాలో ఇంటి పైకప్పుపై చిక్కుకుపోయిన ఆరుగురు కుటుంబ సభ్యులను పడవల సాయంతో రక్షించారు. ముంబైగోవా, ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేలపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని ఒక భాగం ఇలా జలవిలయంతో అల్లాడుతుండగా, మరోవైపు విదర్భ ప్రాంతం మాత్రం వర్షాల కోసం ఎదురుచూస్తోంది. వార్ధా, అకోలా, అమరావతి, యవత్‌మాల్, చంద్రపూర్ జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడం గమనార్హం.

## మెల్‌బోర్న్‌లో మోదీ సందడి.. భారతీయుల భారీ స్వాగతం

ప్రధాని నరేంద్ర మోదీ ఈ వారాంతంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జూలై 9న జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' ప్రవాస భారతీయ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో జనం హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పర్యటనపై ఆస్ట్రేలియాలోని భారత సమాజంలో విపరీతమైన ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని భారత హైకమిషనర్ నగేష్ సింగ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడించారు. "ప్రధాని మోదీకి ఇక్కడ విపరీతమైన ఆదరణ ఉంది. మార్వెల్ ఎరీనాలో జరిగే ఈవెంట్‌కు 25,000 నుంచి 30,000 మంది హాజరవుతారని భావిస్తున్నాం. కానీ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియాలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. పరిమిత స్థలం కారణంగా చాలామందికిఅవకాశంకల్పించలేకపోయాం" అని ఆయన వివరించారు. కొన్నేళ్ల క్రితం సిడ్నీలో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో నాటి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, మోదీని 'ది బాస్' అని సంబోధించిన విషయాన్ని నగేష్ సింగ్ గుర్తుచేశారు. ఈసారి మెల్‌బోర్న్ ఈవెంట్ అంతకుమించి విజయవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని కూడా ప్రసంగిస్తారని తెలిపారు. భారత్‌ఆస్ట్రేలియా సంబంధాలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి విలువలపై ఆధారపడ్డవని, స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్‌ను ఇరు దేశాలు కోరుకుంటున్నాయని సింగ్ అన్నారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు వార్షిక సదస్సులో పాల్గొంటారు. అదేవిధంగా, క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారాన్ని విస్తరించాలని రెండు దేశాలు భావిస్తున్నట్లు తెలిపారు. క్రీడా విజ్ఞానం, సాంకేతికత, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. భారత్ ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలు చాలా బలంగా ఉన్నాయని, దానిని 'క్వాడ్' కూటమితో పోల్చడం సరికాదని నగేష్‌సింగ్ స్పష్టం చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గణనీయంగా పెరుగుతోందని, క్వాడ్ అనేది నాలుగు

## తాలిబాన్ కీలక ప్రకటన.. అమెరికాపై మండిపాటు.. భారత్‌కు స్నేహహస్తం!

ఆఫ్ఘనిస్థాన్‌లోని బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను తిరిగి తమ అధీనంలోకి తీసుకుంటామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరికను తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా తిరస్కరించింది. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో భారత్‌తో వాణిజ్య సంబంధాలను విస్తరించుకోవడానికి ఆసక్తిగా ఉన్నామని సంకేతాలిచ్చింది. ఇండియా టుడేకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాలిబన్ సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రి ముహాజిర్ ఫరాహీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. బగ్రామ్ వైమానిక స్థావరాన్ని అమెరికా తిరిగి పొందడం కేవలం "కలల్లోనే సాధ్యం" అని ఆయన స్పష్టం చేశారు. 2021లో అమెరికా సేనలు వెనక్కి వెళ్లాక బగ్రామ్ స్థావరం తాలిబన్ల ఆధీనంలోకి వచ్చింది. చైనాకు సమీపంలో వ్యూహాత్మకంగా కీలకమైన ఈ స్థావరాన్ని తిరిగి పొందాలని ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో పెరుగుతున్న ఘర్షణలపై ఫరాహీ తీవ్రంగా స్పందించారు. ఇటీవల పాక్ చర్యలకు తాము బలమైన సమాధానం ఇచ్చామని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు ఏ స్థాయి వరకైనా వెళతామని హెచ్చరించారు. జూన్ చివరిలో ఆఫ్ఘన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 38 మంది పౌరులు మరణించారని ఆఫ్ఘన్ అధికారులు ఆరోపించగా, 29 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాక్ ప్రకటించింది. మరోవైపు, భారత్‌తో తమకు చారిత్రక సంబంధాలు ఉన్నాయని ఫరాహీ గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. తరచూ సరిహద్దులు మూసివేస్తున్న పాకిస్థాన్‌పై ఆధారపడకుండా ఇరాన్, భారత్, చైనా ద్వారా వాణిజ్య మార్గాలను విస్తరించుకుంటున్నామని తెలిపారు. కాబుల్‌లో అమెరికాపై సాధించిన విజయానికి గుర్తుగా ఓ యుద్ధ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు కూడా ఆయన వెల్లడించారు.

## భారత్‌ఇండోనేషియా రక్షణ ఒప్పందం




రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ.1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరుదేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండోపసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. అస్త్రా ఎయిర్ టు ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి. భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

## E25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన




దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు. ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ఆలయ నిధులతో ఎన్నికల రాజకీయాలు..

* **మంత్రి కుటుంబంపై పుట్ట మధుకర్ తీవ్ర ఆరోపణలు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా,(ప్రజా స్ఫూర్తి): దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని రాజకీయ ప్రయోజనాలు, అవినీతికి వేదికగా మార్చారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆరోపించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆయన కుటుంబ సభ్యులు ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధన్వాడలో జరిగిన ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో పంపిణీ చేసిన చీరలు కాళేశ్వరం పుష్కరాల కోసం ఆలయ నిధులతో కొనుగోలు చేసినవేనని పుట్ట మధుకర్ ఆరోపించారు. పుష్కరాల కోసం సేకరించిన చీరలు, కిట్లను ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నిల్వ ఉంచి ఇప్పుడు పంపిణీ చేస్తున్నారని అన్నారు. పవిత్ర ఆలయానికి సంబంధించిన వస్తువులను రాజకీయ అవసరాలకు వినియోగించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఆలయ నిధుల వ్యయం, కొనుగోళ్ల వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద స్వయంగా నేను కోరినా అధికారులు సుప్రీంకోర్టు మార్గదర్శకాల పేరుతో సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆలయ ఆస్తుల భద్రతకు సంబంధించిన వివరాలను మాత్రమే వెల్లడించవద్దని సూచించిందని, కానీ ఆదాయం, వ్యయాలకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు.కాళేశ్వరం ఆలయ నిధుల వినియోగంపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గంగా హారతి వంటి కార్యక్రమాల నిర్వహణలో స్థానిక వేదపండితులను విస్మరించి ఇతర రాష్ట్రాల నుంచి పురోహితులను తీసుకొచ్చి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి కుటుంబం ఆలయ వ్యవహారాలపై ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని, ఆలయ నిధులను రాజకీయ అవసరాలకు వినియోగించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ఆలయ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే చర్యలు కొనసాగితే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మంథని బీఆర్ఎస్ నాయకులతో పాటు భూపాలపల్లి ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సేగ్గెం సిద్ధు, జనార్ధన్, మాడ హరీశ్ రెడ్డి, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యానగర్ కాలనీలో సర్ పై ఆర్డీవో సమీక్ష

* **ఎన్యుమరేషన్ ఫారాలను త్వరగా ఆన్ లైన్ చేయాలి**
* **ఆర్డీవో మధు**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలంలో గల విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్ పై ఆర్డీవో మధు స్థానిక బిఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధు మాట్లాడుతూ ఈఎఫ్‌ల సేకరణ, ఫారాల డిజిటైజేషన్ వేగవంతం చేయాలని బీఎల్‌వోలు ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సకాలంలో సేకరించి, వాటి డిజిటైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి ఓటరుకు పారాలు అందడంతో పాటు వాటిని సేకరణను వేగవంతం చేయడంతో పాటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పాలక మండలి ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం పట్ల వారిని అభినందిస్తూ స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి తహసీల్దార్ నాగరాజు, గ్రామ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, వివిధ వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు, జిపిఓ బాలాజీ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యానగర్ పంచాయతీలో నూతన ట్రాక్టర్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలో చుంచుపల్లి మండలంలో గల విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ లో పారిశుద్ధ్య అవసరాలు నిమిత్తం వివిధ వార్డ్ సభ్యుల సమక్షంలో సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి ఆధ్వర్యంలో పంచాయతీ ఆవరణములో నూతన ట్రాక్టర్ ను మండల తాసిల్దార్ నాగరాజు రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రజలు తడి , పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్ లో వేయాలని ఆయన కోరుతూ , పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. నూతన ట్రాక్టర్ ఏర్పాటు చేయడం పట్ల పంచాయతీ పాలక మండలి ను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో వివిధ వార్డ్ మెంబర్స్ , పంచాయతీ గుమస్తా రామకృష్ణ , బిల్ కలెక్టర్ అమర్ నాథ్ , బోస్ , శానిటేషన్ సూపర్వైజర్ దుర్గాప్రసాద్ , పంచాయతీ సిబ్బంది , పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రేగొండ చేనేత సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ, ప్రజాస్ఫూర్తి :రేగొండ చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా పన్నాటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రూపిరెడ్డిపల్లి గ్రామంలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఆయన పేరును ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్నికల అధికారి రిలీఫ్ రెడ్డి అధ్యక్ష పదవికి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా రాచర్ల రాజేందర్, కార్యదర్శిగా కూచన రాజ్‌కుమార్, కోశాధికారిగా కొండా స్వామి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పన్నాటి మార్కండేయ, మంతెన రవీందర్, ఆడెపు బాబు, పన్నాటి రమ, కూచన అరుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పన్నాటి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కలిగిన చేనేత కార్మికుడికి అందేలా చర్యలు తీసుకుంటామని, కార్మికుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం సంఘం సభ్యులు, చేనేత కార్మికులు, గ్రామ పెద్దలు నూతన అధ్యక్షుడు పన్నాటి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థినుల భద్రతే లక్ష్యం

* **మాస్టర్ మైండ్ స్కూల్‌లో షీ టీం, భరోసా టీం అవగాహన సదస్సు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): విద్యార్థినుల భద్రత, సైబర్ నేరాల నివారణ, వ్యక్తిగత రక్షణపై అవగాహన కల్పించేందుకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్ స్కూల్‌లో షీ టీం, భరోసా టీం సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్, వీధి వేధింపులు, వ్యక్తిగత భద్రత, సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో పంచుకోవద్దని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా మహిళలు, బాలికలపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్, భరోసా ఎస్ఐ స్వప్న కుమారి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ప్రతి కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. పద్మా నగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మంగళవారం పాద యాత్ర నిర్వహించారు. అనంతరం రూ.28 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు ను ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహిస్తూ స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తాగునీటి సరఫరా లోప్రెషర్ కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను, అలాగే తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డుపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న సమస్యను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణ చౌరస్తాలో మురుగునీరు ఓవర్ ఫ్లో కాకుండా నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అభిరామ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, బొంబాయి శీను, రాకేష్ జాలిగం, మధుకర్ రెడ్డి, ఎం.డి. నజీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, దుర్గా రెడ్డి, కళ్లెం శ్రీనివాస్, కాలనీ ప్రతినిధులు శౌరి రాజ్, కేదార్ నాథ్, వెంకట్ సాయి, దశరథ్, రామ్ దాస్, సంతోష్, ఏలా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

– **బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ వీరూ నాయక్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి సంస్థ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న సింగరేణి అధికారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ చుంచుపల్లి మండలంలోని త్రీఇంక్లైన్ వద్ద గల సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సింగరేణి అధికారులు కె.చంద్రశేఖర్, బి.అనంతరామయ్య, ఆర్. అశోక్‌రెడ్డి, డి.శంకర్‌లు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని వీరు నాయక్ సందర్శించి సంఘీభావం తెలిపిన అనంతరం మాట్లాడుతూ అధికారులకు పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోలిండియాలో అందిస్తున్న అలవెన్సులను సింగరేణి అధికారులకు సైతం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 2500 మంది అధికారుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని హితవుపలికారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సింగరేణి అధికారులు చేపట్టిన దీక్షకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు లు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సింగరేణి అధికారులు చేపట్టే ఆందోళనల్లో భాగస్వాములమవుతామని హెచ్చరించారు.

## మొక్కజొన్న రైతులకు న్యాయం చేస్తాం: కాంగ్రెస్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల, ప్రజాస్ఫూర్తి : మొక్కజొన్న రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా పూర్తి బాధ్యత తీసుకుని వారికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులు పండించే ప్రతి పంటకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఇప్పటికే రైతులకు అన్యాయం జరగదని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఇటీవల నిర్వహించిన ధర్నాపై మధు వంశీకృష్ణ విమర్శలు చేశారు. గత పదేళ్ల పాలనలో ఇసుక, బొగ్గు అక్రమాలు, భూ ఆక్రమణలు జరిగాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, భూపాలపల్లి నియోజకవర్గానికి తగిన నీటి ప్రయోజనం కల్పించలేదన్నారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సమస్యలు ఉంటే పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వికసిత్ భారత్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన నైన్‌పాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నైన్‌పాక, ప్రజాస్ఫూర్తి : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను వెలికితీసేందుకు కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో మండలంలోని నైన్‌పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికై ప్రతిభ చాటారు.పాఠశాలకు చెందిన శ్రీపతి వర్షిత్, శ్రీరామ్, కార్తీక్, శివకుమార్, గౌతమ్ పాల్గొని రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం. సుధాకర్ విద్యార్థుల బృందాన్ని, వారికి మార్గ దర్శకత్వం వహించిన గైడ్ టీచర్ కె. పల్లవిని అభినందించి, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయంతో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రణీత, రాజయ్య, రఘు, ప్రసాద్, నాగరాజు, శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఓదెలు, సీఆర్పీ తిరుపతితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తులపై అవగాహన సదస్సు




మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి: నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్‌లో 184 బలరాం నగర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ముమ్మర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఓ, బీఎల్ఏలు ప్రజలకు ఎస్ఐఆర్ దరఖాస్తులను ఎలా సక్రమంగా నింపాలి, ఏయే పత్రాలు జత చేయాలి, దరఖాస్తు సమర్పణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను వివరించారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 184 డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, గంగాదరి కృష్ణ ఈ గణేష్. పగిడిపల్లి శ్రీనివాస్ . తుపాకుల జనార్ధన్ . గుట్ల శివ సాయి యాదవ్ కోటేశ్వర్ రాజ్ కుమార్ జంగిలి శివ కుమార్ . తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఐఆర్ ఓటరు జాబితాల పంపిణీ

మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ముమ్మర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సిద్ధమైన ఓటరు జాబితాల పంపిణీ కార్యక్రమం నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, బూత్ స్థాయి ప్రతినిధులకు ఓటరు జాబితాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాల ఖచ్చితత్వం ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొంటూ, ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 184 డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, గంగాదరి, కృష్ణ , ఈ గణేష్, పగిడిపల్లి శ్రీనివాస్, తుపాకుల జనార్ధన్, హేమంత్ పటేల్, గుట్ల శివ, సాయి యాదవ్, కోటేశ్వర్, రాజ్ కుమార్, జంగిలి శివ కుమార్, శ్రీధర్ గౌడ్, ఎమ్మార్ శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎకో క్లబ్ ఆధ్వర్యంలో గుడ్డ చేతి సంచుల తయారీ శిక్షణ

ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్),మెదక్‌లో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు గుడ్డ చేతి సంచుల తయారీ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకుని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ హితమైన గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, ఎకో క్లబ్ చైర్మన్ ప్రొఫెసర్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థులు పర్యావరణానికి అనుకూలమైన వస్తువులను వినియోగించాలని, భూమికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిత్యావసర వస్తువులు, కూరగాయలు తదితరాలను




కొనుగోలు చేసే సమయంలో గుడ్డతో తయారుచేసిన సంచులను ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. రిసోర్స్ పర్సన్ అశోక్ కుమార్ విద్యార్థులకు గుడ్డ చేతి సంచులను సులభంగా తయారు చేసే విధానాన్ని ప్రదర్శిస్తూ ప్రాయోగిక శిక్షణ అందించారు. అనంతరం విద్యార్థులు స్వయంగా తయారుచేసిన గుడ్డ సంచులను కళాశాల అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎకోఅ క్యూ కు క్లబ్ కన్వీనర్ మురళి, ఎకో క్లబ్ సభ్యులు వేణుగోపాలరావు, విశ్వనాథం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. నాగేందర్ రావు,శ్రీలత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంజాద్ అలీ, సూపరింటెండెంట్ మల్లికార్జున్, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందడంతో పాటు, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలనే సందేశం అందించారు.

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానికి పోస్ట్ కార్డులు



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: పార్లమెంటు సమావేశాల్లోనే మహిళా బిల్లు ఆమోదించి మహిళా రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కి మహిళలు పోస్టుకార్డులు పంపారు. మంగళవారం కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ప్రధానమంత్రి మోడీకి మిస్డ్ కాల్స్ చేశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మయూరి సింగ్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి,లు మాట్లాడుతూ మహిళా బిల్లును వెంటనే ఆమోదించి రిజర్వేషన్ అమలు చేసి చట్టబద్ధత కల్పించాలన్నారు. అలాగే జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకపోయి పార్టీని పటిష్ట పరచాలన్నారు,రైతు భరోసా పై రైతులకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలు పట్టణాలు మున్సిపాలిటీలకు చెందిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు సుజాత,స్వరాజ్యలక్ష్మి, భాగ్య, జానకి,సౌజన్య, సరస్వతీ,పద్మ,సోమమ్మ, లలిత,రాధా,నారాయణమ్మ, స్వప్న,లలిత, పల్లవి, వెంకటమ్మ,స్వరూప,రేఖ, సాత్విక,అశ్విని,స్వప్న, అంజమ్మ, లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రత

* **నెలవారీ తనిఖీలో పరిశీలించిన కలెక్టర్ హరిత**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) భద్రపరిచిన గోదాము వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు అమల్లో ఉన్నాయని కలెక్టర్ కె. హరిత తెలిపారు. మంగళవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు జమీల్‌తో కలిసి ఈవీఎం గోదామును సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాము వద్ద 24 గంటలపాటు భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గోదాము వద్ద భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తనిఖీలో నాయబ్ తహసీల్దార్ శ్యామ్‌లాల్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా చల్లా లక్ష్మి ప్రసాద్ నియామకం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చల్లా లక్ష్మీప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు చేతుల మీదుగా చల్లా లక్ష్మీప్రసాద్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చల్లా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు నాయకత్వంలో సమన్వయంతో కలిసి పని చేస్తామని చెప్పారు. పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల శ్రవణ్ కుమార్,మిట్టపల్లి రమేష్ ,కర్నాటి సురేందర్,సోమా వెంకటేశ్వర్లు,సోమా ప్రవీణ్ కుమార్,షీలా శంకర్ , తల్లాడ రాము,తోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, మోడల్ స్కూళ్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



భువనగిరి,ప్రజాస్ఫూర్తి : గుండాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం సందర్శించారు.. ఈ సందర్భంగా కసుర్బా గాంధీ పాఠశాలలో చేపడుతున్న మరమ్మతు (సివిల్) పనుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు, త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం కేజీబీవి లో తరగతి గదులను పరిశీలించారు.ఆరవ తరగతి విద్యార్థిని చదివించి, అభ్యాసన సమర్థ్యాన్ని రాబట్టారు . బాలికల హాస్టల్ గదులను, కిచెన్ షెడ్ ను, వంట సరుకులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో మంచి పౌష్టి ఆహారం శుద్ధమైన త్రాగునీరు అందించాలన్నారు. తదనంతరము మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ సందర్శించి ప్రాంగణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. అక్కడ ఉన్న నిర్వాహకులు కేర్ టేకర్ కావాలని కలెక్టర్ ని కోరారు. అనంతరం మోడల్ స్కూల్ లో తరగతి గదులను పరిశీలిస్తూ, బాలుర ,బాలికల మరుగుదొడ్లను పరిశీలించి ప్రిన్సిపల్ రాము పై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు , ఏం శ్రీనిధులు, స్కూల్ గ్రాంట్ వచ్చినా ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని అడిగారు, దీనిపై స్పెషల్ ఎంక్వయిరీ కమిటీని పంపిస్తా అన్నారు , రెండు రోజులలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, మండల విద్యాధికారి మన్నె అగ్గి రాములు, ఎంపీడీవో చండీరాణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆర్ .విజయలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాము,పి ఆర్ ఏ ఈ ఆర్ దామోదర్,సిడిపిఓ నాజి, సి ఆర్ పి దేవన బోయిన. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల పట్ల శాపంగా మారిన బోకస్ విద్యార్థి సంఘాలు

* **ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : స్వచ్ఛందంగా మధ్యతరగతి విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్న ఎకనామికల్ విద్యాసంస్థల పట్ల బోకస్ విద్యార్థి సంఘాలు ఒక శాపం లా మారాయని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని నాంపల్లి లో గల కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ట్రస్మా రాష్ట్ర బాడీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యాబోధన అందించాలా లేదా ఈ బోకస్ సంఘాలను ఎదుర్కోవాలా అనేది ఒక సవాలుగా మారిందన్నారు. గతంలో విద్యార్థి సంఘాల్లో పనిచేసిన వారు, బోకస్ విద్యార్థి సంఘాలు పెట్టుకొని ఆర్టీఐ యాక్ట్ ని భూతంలా చూపిస్తూ విద్యాసంస్థలలో, ప్రమాణాలు లేవని అదే పనిగా వారి జీవన ఆధారంగా పెట్టుకుని ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కుల సంఘాలా పేరు పెట్టుకుని కొని స్కూల్స్ కి ఎలాంటి సంబందం లేనప్పటికి వారు కూడా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ట్రస్మా జనరల్ సెక్రెటరీ కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ స్థానిక ఎంఈఓ లను అసౌకర్యానికి గురి చేసి వారితో లెటర్స్ సర్వ్ చేయించి బ్లాక్మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది జాయింట్ యాక్షన్ కమిటీ అని అవతారం ఎత్తి ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వీరిని తట్టుకోలేక కొన్ని విద్యాసంస్థలు మూత పడిపోయాయన్నారు. స్కూల్ బుక్స్ అనే విషయానికి వస్తే స్కూల్స్ యజమాన్యం వారు థర్డ్ పార్టీకి బుక్స్ అమ్ముకోనికి సౌకర్యం కలిగించి వారికి డిస్కౌంట్ లో బుక్స్ అమ్మనీకి పేరెంట్స్ కి వసతి కల్పిస్తున్నారన్నారు. విద్యాసంస్థలే అమ్ముతున్నాయని విద్యాసంస్థల పై అరాచకంగా దాడి చేస్తున్నారన్నారు. స్కూల్ ఫీజు విషయంలో స్కూల్స్ ఒక్క గవర్నింగ్ బాడి నిర్ణయించిన దాన్ని అమలుపరుస్తున్న తరుణంలో వీరు కూడా దాన్ని ఛాలెంజ్ చేస్తూ అవిట్లలో జోక్యం కలిగించుకొని సాఫ్ట్ గా నడుస్తున్న సంస్థని అల్లరి పాలు చేస్తున్నారన్నారు. ట్రస్మా ట్రెజరర్ కె. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 12 వేల ఇలాంటి విద్యాసంస్థలు అందులో ఐదు లక్షల మంది విద్యా, విద్యా బోధన, విద్యా బోధన హేతు సిబ్బంది ఉన్నారని ఇందులో దాదాపు 35 లక్షల మంది విద్యార్థులు విద్యాబోధన అందుకుంటున్నారన్నారు. ఇలాంటి విద్యాసంస్థలలో విద్యను అభిషేకించి ఎన్నో ఉన్నతమైన శాఖలలో కొనసాగుతున్నారన్నారు. ఇలాంటి సంస్థల మనుగడ ఉండాలని ట్రస్మా రాష్ట్ర కమిటీ డిజిపి సీవీ ఆనంద్ ని కలిసి వారికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన స్పందిస్తూ అన్ని పోలీస్ స్టేషనులకు అలర్ట్ జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదే విషయమై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నవీన్ నికోల్లాస్ కి కూడా వినతిపత్రం అందజేశామని, బ్యాంక్, హాస్పటల్స్ కి ఏ విధంగానైతే రక్షణ కల్పిస్తారో అదే విధంగా స్కూల్స్ కూడా రక్షణ కల్పించే జీవోపై సమీక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ రామేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, పెద్ద ఎత్తున స్కూల్స్ మేనేజ్మెంట్ బీ.ఆంజనేయులు, వినోద్ జాదవ్, సి.హెచ్.నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర పథకాలను సరైన లబ్ధిదారులకు అందించాలి

* **ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి:కేంద్ర ప్రభుత్వం జిల్లాలో అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సరైన లబ్ధిదారులకు అందించాలని అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కె.హరిత అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కలెక్టరేట్లో నిర్వహించిన "దిశ" సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్ బాబు, కోవలక్ష్మి, ఐటీడీఏ పీవో మంద మకరంద, అదనపు కలెక్టర్లు డేవిడ్, యువరాజ్ మర్మాట్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, డిఆర్ఓ వేణు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అమలు చేస్తుందన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ జిల్లాలో మానవ వనరుల కొరత ఉందని ఒక్కో జిల్లా అధికారి రెండు మూడు శాఖలు నిర్వహించాల్సి వస్తుందని దీంతో అనుకున్న సమయానికి అవసరమైన ఫలితాలు రావడంలేదని తెలిపారు. రానున్న రోజుల్లో తీసే సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలంటూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ టవర్ల నిర్మాణంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని అన్నారు. కేంద్రం నుండి వచ్చే గ్రామీణాభివృద్ధి శాఖ నిధులలో కూడా తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. తన నియోజకవర్గంలోని 4 మండలాల్లో జరుగుతున్న పోడు భూములను ప్రస్తుత సంవత్సరానికి అటవీ అధికారులు వదిలేసి వచ్చే సంవత్సరం జాయింట్ సర్వే నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని దిశగా అధికారులను ఆదేశించాలని ఎంపి ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ తో పాటు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా

* **టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టాలి**
* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: గంజాయి వంటి మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తూ మత్తు పదార్థాలను నిర్మూలించుటకు తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ఎక్సైజ్ శాఖ పనితీరు పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మత్తు పదార్థాలు పూర్తిగా నిర్మూలించాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణపై పాఠశాలలు,కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు, 5 బార్లు కు 20242025 వ సంవత్సరానికి 574.08 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని, 2025 వ సంవత్సరానికి 410. 44 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తామని, పాఠశాలలో,కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నాగేశ్వరరావు, నరేందర్, సలాం ముస్తఫా, మాన్ సింగ్, రాజేష్, రామచందర్, ఖాజా ఆహమ్మద్, అరుణ, విజయ్ సిద్ధార్థ, హరీష్‌లు పాల్గొన్నారు.

## ఘనపురం గణప సముద్రం రిజర్వాయర్‌లో చేపల వేటపై రెండు నెలల నిషేధం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఘనపురం మండలం గణప సముద్రం రిజర్వాయర్ పరిధిలో వరదల నేపథ్యంలో చేపల వనరుల సంరక్షణ కోసం 2026 జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట, చేప పిల్లల సేకరణ, రవాణా, విక్రయాలపై నిషేధం విధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వై. విజయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని జలాశయాల్లో వరదల కారణంగా చేప పిల్లల అభివృద్ధి, మత్స్య సంపద పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తెలంగాణ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ చట్టం-1976 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్స్యకార సహకార సంఘాలు, సంబంధిత అధికారులు, గ్రామస్థులు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించి చేపల వనరుల సంరక్షణకు సహకరించాలని కోరారు. ఈ చర్యలతో వరదల అనంతరం చేపల ఉత్పత్తి పెరిగి మత్స్యకారులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవు

* **ముస్తాబాద్ ఎస్ ఐ జ్యోతి**
* **ముస్తాబాద్, ఆవునూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాబోయే సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్ ఐ జ్యోతి హెచ్చరించారు. మంగళవారం ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు ఆవునూర్ గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులను ఆమె ముందస్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ జ్యోతి మాట్లాడుతూ, లైసెన్స్ ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను నిలువునా ముంచే వ్యాపారస్తులపై కఠిన చట్టాలున్నాయన్నారు. రైతులకు తప్పకుండా రశీదులు అందజేయాలని, ఒకవేళ ఎవరైనా ఫర్టిలైజర్స్ షాప్‌ల నిర్వహకులు రశీదులు ఇవ్వకుంటే సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా సీజన్ ముగిసే వరకు ఆ రశీదులను భద్రత పరుచుకోవాలని సూచించారు. మండలంలో నకిలీ విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## తెలంగాణలో రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తాం

* **టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్**




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: భువనగిరిలో జరిగిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ మొట్టమొదటి బహిరంగ సభను పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన బడుగు బలహీన వర్గాల ప్రజలకు టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భువనగిరి సభకు పెద్ద ఎత్తున బడుగు బలహీన వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేశారని అన్నారు. ఈ సభ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారటీల ఐక్యతను చాటిచెప్పడం జరిగిందని అన్నారు. అగ్రవర్ణాల నాయకుల పాలన వ్యవస్థకు తెలంగాణలో చరమగీతం పాడే రోజు వచ్చిందని అన్నారు. ఈ సభలో టిఆర్పి రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పేదలకు భూములు పంచాలని చేసిన ప్రసంగానికి ప్రత్యేక స్పందన వచ్చిందని రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 59 ఎమ్మెల్యే సీట్లు గెలవడం లక్ష్యంగా సర్జికల్ స్ట్రైక్ చేస్తామని అన్నారు. భువనగిరి సభ ఇచ్చిన స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. భువనగిరి సభ లక్ష్యాలను టిఆర్పి నాయకులు గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో టిఆర్పి జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నెం మంజుల, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు , నాయకులు బొల్లె సైదులు, ఆవుల అంజయ్య, వర్రె కవిత, కోలా కరుణాకర్, ఆరూరి రమేష్, బొమ్మగాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మంద కొమరమ్మ నగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 26వ వార్డు మంద కొమరమ్మ నగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎండి పాషా ఘనంగా ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చేసి మాదిగల చిరకాల కోరిక అయినటువంటి ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నారు. 32 సంవత్సరాల కాలం నుండి అనేక ఉద్యమాలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అనేక ఫలాలను తీసుకొచ్చి పెట్టిందన్నారు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన చేసిన అనేక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎండి రజియా, ఎంఎంఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, ఎమ్మెస్ పి మహిళా జిల్లా సీనియర్ నాయకురాలు పద్మ,కైక, ఎం ఎస్ పి మహిళా జిల్లా అధికార ప్రతినిధి సుమిత్ర, ఎంఎంఎస్ మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, వీహెచ్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న,జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ,ఎం ఎస్ పి మహబూబాబాద్ మండల ఇన్చార్జి సైదులు, కాలనీ వాసులు రాములు, వెంకటమ్మ, రమణ, కీర్తి, లక్ష్మి, శేషమ్మ, మహేశ్వరి, వెంకన్న, ప్రభాకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నంద తండాలో ఘనంగా సీత్లా పండుగ



కొత్తగూడెం, ప్రజాస్ఫూర్తి : కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలంలో గల నందా తండా గ్రామం నందు గ్రామ సర్పంచ్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో బంజారా సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే సీత్లా పండుగ ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్పంచ్ బలరాం నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ సీత్లా మాతకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి వర్షాలు సమృద్ధిగా పడి రైతులు పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణం లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా ప్రారంభం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల మురళీధర ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనము, రక్షా బంధనము కార్యక్రమాలు అర్చకుల వేద మంత్రాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మృత్సంగహణం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. జూలై 10 వ తేది శుక్రవారం రాత్రి శ్రీ రుక్మిణి సత్యభామ దేవేరిలతో శ్రీ వేణుగోపాలస్వామి తిరు కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తామని ఆలయ ఇవొ సత్యనారాయణ, ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల మురళీధర ఆచార్యులు తెలిపారు. జూలై నెల 12 వ తేది వరకు జరిగే బ్రహ్మోత్సవ వేడుకలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సహాయ అర్చకులు వేదాల సుదర్శన ఆచార్యులు, యజ్ఞాచార్యులు అర్చకం రంజిత్ రామానుజాచార్యులు, శరత్ ఆచార్యులు, భక్త బృందం కందిమల్ల శంకర్, మాడిశెట్టి విజయకుమార్, ఉప్పల సత్యనారాయణ, కొత్తపేట రామకృష్ణారావు, శ్రీరంగం శ్రీనివాస్ , రాము, వల్లీ కుమారి, కందిమల్ల విజయలక్ష్మి , వీర్లపాటి హైమావతి, శ్రీరంగం సోమలక్ష్మి, పద్మ, ఆండాళ్ గోష్ఠి భక్త బృందం పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: వలిగొండ పట్టణ కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32 సంవత్సరాల ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షులు పల్లెర్ల రామచందర్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరించారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బ దానయ్య మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 32 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో మందకృష్ణ మాదిగ ప్రజా పోరాటాలు చేసి ఎస్సీ వర్గీకరణతో పాటు అన్ని వర్గాలకు కూడా హక్కులు సాధించిన ఘనత మహాజన నేత మందకృష్ణ అని వారు గుర్తు చేశారు ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిని యాదగిరి, సలిగంజి బిక్షపతి, ఎస్సీ మోర్చ పల్లెర్ల నరసింహ, పోలేపాక బిక్షపతి, మోత్కూర్ శ్రీరాములు, ఉప కులాల నాయకులు ఎదురుగట్ల యాదగిరి, పోలేపల్లి సుదర్శన్, పోలేపాక గణేష్, పోలేపాక ప్రవీణ్, వెంకట గల్ల మహేష్ ,దుబ్బ మహేష్, సూరేపల్లి స్వామి, పల్లెర్ల రాఖి, పల్లెర్ల శివ, అరూర్ వెంకటేశం, గట్టు శివ, లోతుకుంట బిక్షం తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనులు వేగంగా పూర్తి అయ్యేలా చొరవ చూపాలి

*** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగంగా పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.మంగళవారం బొమ్మలరామారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షిస్తూ ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, ఉపాధి కల్పన, పనుల నాణ్యత, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేసి, పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. మిగిలి ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.రామలింగంపల్లి తుమ్మకుంట గ్రామాలను సందర్శించారు రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం మీద ప్రత్యేక దృష్టి సారించాలి అని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

*** ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**

అనంతరం బొమ్మలరామారం మండలం చికటిమామిడి గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా యూరియా ఎరువు నిల్వలు, సరఫరా, పంపిణీ విధానం, రైతులకు అందుబాటు వంటి అంశాలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ఎలాంటి అక్రమ నిల్వలు లేదా కృత్రిమ కొరత సృష్టించరాదని దుకాణ నిర్వాహకులకు ఆదేశించారు. వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన యూరియా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి. శ్యామల, మండల పంచాయతీ అధికారి శ్రీమాలిని, వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు.

## 11 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ తొలగించాలని ఎస్సి ఆఫీసు ముందు ధర్నా



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామం, బీసీ కాలనీ ఇండ్లపై నుంచి వెళ్లిన 11 కెవి విద్యుత్ లైన్ కారణంగా ప్రాణాపాయం నెలకొన్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఈమధ్య కురిసిన వర్షానికి బిసి కాలనీలో కరెంటు వైర్ తెగి ఇండ్ల మధ్యన పడటంతో ప్రజలకు, టీవీలు,ఫ్యాన్లు నష్టం జరగకుండా పెను ప్రమాదం తప్పింది.బీసీ కాలనీలో ఇళ్లపైగా 11 కెవి హైటెన్షన్ లైన్ వెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీ కాలనీ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని,బిసి కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ప్రమాదం జరిగే వరకు అధికారులు స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. ఏ క్షణంలోనైనా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతఅధికారులు స్పందించి. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ గ్రామంలోనీ కరెంట్ సబ్ స్టేషన్ మొగిలిచర్ల జెగ్య తండా ఫీడర్ నుండి ప్రస్తుతం గ్రామానికి సరఫరా అవుతుంది.కరెంట్ రాత్రి పగలు రెండు నుండి నాలుగు గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహబూబాబాద్ టౌన్ నుండి బేతోలు 6వ వార్డుకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో జినుక ఎల్లయ్య, షేక్ యాకుబ్, గడ్డం షేక్ జావిద్,గుండపల్లి వెంకటేష్, షేక్ ఇమ్రాన్,గడ్డం చెన్నయ్య, షేక్ సోషల్,ఎర్రం వరుణ్, షేక్ హిమాయితుల్లా, దూది కట్ల దేవమ్మ,ఆదేపు ఉమా,సకినం రత్న, గుండపల్లి లచ్చమ్మ,షేక్ మీనా,గుండెపల్లి కవిత, షేక్ జానీబి తదితరులు పాల్గొన్నారు.

## 4వ తెలంగాణ స్టేట్ మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ మీట్ 2026



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ ఇందిరాగాంధీ అథ్లెటిక్స్ స్టేడియం లో మంగళవారం ఉదయం మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా స్థాయి ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుండి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమ అధ్యక్షులుగా జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు అరునార్తి వెంకటరమణ వ్యవహరించారు. జిల్లా యువజన,క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ప్రభు, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ సరైన శిక్షణ పొంది జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలాగా నిత్యం సాధన చేయాలని అన్నారు. చదువు, క్రీడలు రెండు వ్యక్తులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో క్రియాశీల పాత్ర పోషిస్తాయని, క్రీడాకారులకు రాష్ట్రంలో మంచి భవిష్యత్తు ఉందని, క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందివ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నదని అన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో రాణించిన క్రీడాకారులు ఇంజనీరింగ్ మెడికల్ విభాగాలలో, ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ ద్వారా సీట్లు సంపాదించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడేటువంటి అవకాశాలు క్రీడల ద్వారా పొందవచ్చని అన్నారు. మెదక్ జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందుంటుందని నేడు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో రాణించేలాగా తీర్చిదిద్దడానికి గాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 9న యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. మెదక్ కేంద్రంలో గతంలో ఉన్నటువంటి అథ్లెటిక్ అకాడమీ తిరిగి ప్రారంభించడానికి కలెక్టర్ కృషి చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజేందర్, సత్యనారాయణ, సుజాత, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లపై ఆహార భద్రత శాఖ ఆకస్మిక తనిఖీలు

**– నమూనాల సేకరణ.. నోటీసులు జారీ**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సుజాతనగర్ మండల కేంద్రంలోని పలు హోటళ్లు, స్వీట్ల తయారీ, విక్రయ దుకాణాల్లో ఆహార భద్రత అధికారి శరత్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా కొన్ని ఆహార వ్యాపార సంస్థలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం తప్పనిసరిగా ఉండాల్సిన రిజిస్ట్రేషన్, లైసెన్సులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత నిర్వాహకులు వెంటనే రిజిస్ట్రేషన్, లైసెన్సులు పొందడంతోపాటు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించేందుకు మూడు లీగల్ నమూనాలు, మూడు సర్వైలెన్స్ నమూనాలను సేకరించి విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార పరీక్షా ప్రయోగశాలకు పంపించారు. అలాగే పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాల్లో లోపాలు గుర్తించిన రెండు ఆహార వ్యాపార సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి శరత్ మాట్లాడుతూ, ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడం ప్రతి ఆహార వ్యాపార సంస్థ బాధ్యత అని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే ఆహార వ్యాపార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జిల్లాలో ఆహార భద్రత శాఖ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆహార భద్రత అధికారి శరత్ తెలిపారు.



## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మ హత్య

జనగామ, ప్రజాస్ఫూర్తి : అప్పుల ఒత్తిడి, డబ్బులు తిరిగి రాక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసు కున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులకు అందిన వివరాల ప్రకారం, పట్టణంలోని పూర్ణిమ కాలనీకి చెందిన పగిడి పల్లి మల్లయ్య (45) వివిధ అవ సరాల నిమిత్తం పలువురి వద్ద నుంచి అప్పులు చేసి, అలాగే తన వద్ద ఉన్న సొమ్ముతో పాటు తన తమ్ముడు గుంటి సుదర్శన్ కు రూ.1.44 కోట్లు, మరో వ్యక్తికి రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చిన ట్లు తెలుస్తోంది. అయితే పలు మార్లు అడిగినా ఆ డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మల్ల య్య తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడికి గురయ్యాడు.ఈ ఏడాది మే నెలలో గ్రామ పెద్దల సమక్షంలో డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో జూలై 4న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి భార్య పగిడిపల్లి అనిత ఫిర్యాదు మేరకు జనగామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడికానున్నాయి.

## ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణ పోరాటం చారిత్రాత్మకం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మహబూబాబాద్ పట్టణంలోని 29వ వార్డు గుమ్మనూరు అర్జునవాడలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ కుల పెద్ద పడిశాల వెంకన్న ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి సంస్థ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంఎంఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలకు పైగా సాగించిన నిరంతర ఉద్యమ ఫలితంగానే మాదిగల చిరకాల డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చాయని ఆమె అన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాదాసు ప్రమీల, తిప్పర్తి రమణ, మాదాసు మల్లేష్, శేషం మహేష్, జనక సుమలత, మాదాసు ఉమా, చిలువల ఇద్దయ్య, పడిశాల ఆకాష్, శాకుల శంకర్, జినుక బద్రమ్మ, మాదాసు అనూష, శేషం రాములమ్మ, తిప్పర్తి కాంతమ్మ, పల్లె అనసూర్య, వెంపటి ఉప్పలమ్మ, మాదాసు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## బాబు నాయక్ తండాలో ఘనంగా సీత్లా పండుగ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బాబు నాయక్ తండాలో బంజారా సమాజం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే సీత్లా పండుగ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు డా. ధరంసోత్ సీతారాం నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీత్లా మాతకు భక్తి శ్రద్ధలతో పూజలు సమర్పించి, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని, పశు సంపద అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని, గిరిజన బంజారాలు ప్రతి ఏటా నిర్వహించే ఏకైక సంప్రదాయ పండుగ సీత్లా పండుగ అని తెలుపుతూ బంజారా సోదర సోదరీమణులందరికీ సీత్లా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా డా. ధరంసోత్ సీతారాం నాయక్ మాట్లాడుతూ సీత్లా పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వస్తున్న ఈ గొప్ప సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బంజారా సమాజ ఐక్యతను, ప్రకృతి పట్ల గౌరవాన్ని చాటిచెప్పే ఈ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తండాకు చెందిన మహిళలు, పెద్దలు, యువత, చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పూజలు నిర్వహించారు.

# నాటకాలు విడిచి సమస్య పై పోరాడండి

*** ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్: సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ కొరకు ప్రతిపక్షాలు చేస్తున్న నాటకాలు ఇప్పటికైనా ఆపి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి సమస్య పై పోరాటం చేస్తే బాగుంటుంది అని ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్ తెలిపారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ పై నెలకొన్న సమస్య పై సర్పంచ్ చందు నాయక్ మీడియా తో మాట్లాడుతూ ఇది ఇప్పటి సమస్య కాదని బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అప్పటి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేదల భూములు లాక్కొని ప్రభుత్వానికి అప్పజేయడం నిజం కదా అని అన్నారు.అక్కడ ఐటీ కంపెనీ వస్తుంది ఉద్యోగాలు వస్తాయని అమాయక ప్రజలను, రైతులను మభ్యపెట్టి భూములు బలవంతం గా లాక్కొని గవర్నమెంట్ కు అప్పజేప్పి ఇప్పుడు గుంటనక్కల వలె నాటకాలు ఆడుతున్నారని ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని అన్నారు.అప్పుడు మాజీ ఎమ్మెల్యే పేద ప్రజల భూములు లాక్కొని ప్రభుత్వానికి అప్పాజెప్పకుండ ఉంటే ఇప్పుడు అక్కడ డంపింగ్ యార్డ్ కానీ మరి వేరే ఏది కానీ వచ్చి ఉండేదా అని అన్నారు.సిద్దాపూర్ డంప్ యార్డ్ రాకుండా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు ప్రభుత్వం తో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా అందరు ఎమ్మెల్యే గారితో కలిసి సమస్య పై పోరాటం చేయాలనీ అన్నారు. అలాకాకుండా ఎమ్మెల్యే శంకర్ పై లేని పోనీ అబండాలు వేస్తె చూస్తూ ఊరుకొనేది లేదని అన్నారు.

# అతివేగ ఇన్నోవా బీభత్సం..

*** గంటల వ్యవధిలో ఇద్దరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**



పాలకుర్తి / జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో అతివేగంగా దూసుకొచ్చిన ఇన్నోవా కారు బీభత్సం సృష్టించింది. రెండు వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పాలకుర్తి మం డల కేంద్రంలో అతివేగంగా వచ్చిన ఇన్నోవా కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిం ది. ఈ ప్రమాదంలో రఘునాథపల్లి మం డలం వెల్ది గ్రామానికి చెందిన పెంతల వెంకటలక్ష్మి (50) అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త శ్రీనివాస్ తీవ్రంగా గాయపడగా, వెంటనే ఆసుపత్రికి తర లించి చికిత్స అందిస్తున్నారు. అదే కా రు గూడూరు గ్రామం వద్ద మరో ప్రమా దానికి కారణమైంది. ఈ ఘటనలో కిష్టా జీగూడెం గ్రామానికి చెందిన వడ్లకొండ రంజిత్ (29) అక్కడికక్కడే మృతి చెందాడు. వరుస ప్రమాదాలతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాలకు చేరుకుని మృతదేహా లను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణా లు, ఇన్నోవా కారు వేగం, డ్రైవర్ నిర్ల క్ష్యం తదితర అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపే లక్ష్యంగా షీ టీమ్ అవగాహన కార్యక్రమాలు




బచ్చన్నపేట/జనగామ, ప్రజాస్ఫూర్తి : బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చి, మహిళల భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో జనగామ జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో బచ్చన్నపేట మం డలంలోని పలు విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించా రు. మంగళవారం జిల్లా షీ టీమ్ ఎస్ఐ లలిత ఆధ్వర్యంలో కస్తూర్బా బాలికల పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ బచ్చన్నపేట, తుమ్మబాల పాఠశాలల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థినులకు మహి ళల భద్రత, చట్టపరమైన రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ లలిత మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయప డకుండా వెంటనే షీ టీమ్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూ చించారు. షీ టీమ్‌ను ఎలా సంప్రదిం చాలి, ఫిర్యాదు చేసే విధానం, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, సై బర్ వేధింపుల నుంచి ఎలా అప్రమత్తం గా ఉండాలి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం ఎలా పొందాలనే అంశాలను వివరించారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తమ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించిన ఆమె. మహి ళలు, బాలికల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరో సా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బందితో పాటు బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సిరాజుద్దీన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.మంగళవారం ఆయన కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో యూరియా, విత్తనాలు, రైతు నమోదు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉన్నందున రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా కంది, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌ను పరిశీలించి రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా సూచనలు ఇవ్వాలన్నారు.కంది పంటకు కనీస మద్దతు ధర ఉన్నందున రైతులు అధికంగా సాగు చేసేలా ప్రోత్సహించాలని, ఉత్పత్తి ఎక్కువగా వచ్చిన సందర్భంలో మార్కెటింగ్ సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యానవన పంటల వైపు వెళ్లే రైతులను కూడా ప్రోత్సహించాలని, ఆయిల్ ఫామ్ వంటి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.వివిధ రకాల విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా విత్తనాల నిల్వలు ఉండేలా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కౌలు రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సాగు చేయని వ్యక్తులు యూరియా బుక్ చేసుకుని అక్రమంగా విక్రయించకుండా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.ప్రతి కేంద్రంలో యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని, ఆగస్టు 5వ తేదీలోగా కనీసం 75 శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ రైతు వేదికల్లో అందుబాటులో ఉండాలని, విత్తనాలు, ఎరువుల నిల్వలు, సరఫరా సమయాల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతు వేదికలను పరిశుభ్రంగా ఉంచి, రైతులకు అవసరమైన సమాచారం ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్,సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రకాశ్ ఎలక్ట్రికల్స్కు స్టార్ ఫర్మామెన్స్ అవార్డు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : నాలుగు దశబ్దాలకుపైగా రైతుల నమ్మకం మరోసారి ప్రకాశ్ ఎలక్ట్రికల్స్కు స్టార్ ఫర్మామెన్స్ అవార్డు లభించింది. మహబూబాబాద్ జిల్లా కేద్రంలో గత 40 ఏళ్లకు పైగా రైతులకు నాణ్యమైన, నమ్మకమైన సి ఆర్ ఐ వ్యవసాయ మోటార్లు, విక్రయిస్తున్న ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అంటే తెలియని వారు ఉండరు. ప్రతీ సంవత్సరం సీఆర్ఐ పంప్స్ వారు నిర్వహించే రాష్ట్ర స్థాయి అవార్డుల్లో ఈ సారి కూడా ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ తన స్థానాన్ని పదిలపరచుకుంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక సమావేశంలో వీరన్న స్టార్ ఫర్మామెన్స్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన సీఆర్ఐ రాష్ట్ర డీలర్ల సమావేశంలో ఆ కంపెనీ జోనల్ మేనేజర్ మధుసూదన్, తెలంగాణ రీజినల్ మేనేజర్లు శ్రీనివాస్, మహేందర్, రాము,,సునీల్‌లు నాళ్ల వీరన్నకు అందచేసి,ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఆర్ఐ పంప్స్ జోనల్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అంటేనే ఒక బ్రాండ్ అని కొనియాడారు.నాళ్ల వీరన్న అంటేనే వినియోగదారులకు ఒక బలమైన నమ్మకమన్నారు. గత 40 ఏళ్లకు పైగా మానుకోట జిల్లా కేంద్రంలోనే కాకుండా చుట్టు పక్కల ఎన్నో గ్రామాల రైతులు, వినియోగదారులకు ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అందిస్తున్న పరికరాలు నాణ్యతకు చిరునామాగా నిలిచాయన్నారు. పురస్కార గ్రహీత నాళ్ల వీరన్న మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక సీఆర్ఐ సంస్థ నుంచి ఐదో సారి రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు తీసుకొచ్చిన ప్రోత్సాహంతో రైతులకు మరింత సేవలను అందించి సీఆర్ఐ సంస్థ మన్ననలను మరోసారి పొందుతానని అన్నారు. కాగా అవార్డు అందుకున్న నాళ్ల వీరన్నను జిల్లా పరిధిలోని ప్రముఖులు, వ్యాపారులు, డీలర్లు, ఎలక్ట్రికల్స్ దుకాణాల యజమానులు, రైతులు,వినియోగదారులు, మిత్రులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి

*** ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : డంపింగ్ యార్డ్ హటావో - సిద్ధాపూర్ బచావో అనే నినాదంతో షాద్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు , ప్రతినిధులు పూలమాల వేసి వినతి పత్రం అందచేశారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై మాట్లాడారు. సిద్ధాపూర్ ప్రాంతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 641 ని వెంటనే రద్దు చేయాలని,డంపింగ్ యార్డ్ కారణంగా పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని,దుర్వాసన, వ్యాధుల వ్యాప్తి , వ్యవసాయ భూములకు నష్టం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం,రైతుల జీవనాధారం,గ్రామాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, వంకాయల నారాయణ రెడ్డి, దేవేందర్ యాదవ్, డోలి రవీందర్, రామకృష్ణ,వడ్డే బాలయ్య, కౌన్సిర్లు మాజీ కౌన్సిలర్ బీఆర్ఎస్ నాయకులు నందారం అశోక్ యాదవ్, జె.శ్రీనివాస్ గౌడ్, మాదారం క్రిష్ణ, గోపాల్ గౌడ్, కోస్గి శ్రీనివాస్, యుగంధర్, జూపల్లి శంకర్, కడాల శ్రీశైలం, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, భైర్కాన్ పల్లి క్రిష్ణ, దినేష్ సాగర్, శివా చారి, మధుసూదన్ రెడ్డి, రాందాస్ నాయక్, బిచ్య నాయక్, సంతోష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిది నెలలుగా అసంపూర్తిగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

*** ప్రమాదకరంగా మారిన నిడిగొండ సర్వీస్ రోడ్డు**



జనగామ, రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎనిమిది నెలలుగా అసంపూర్తిగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం సర్వీస్ రోడ్డుపై తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిడిగొండతో పాటు పరిసర ప్రాంతాల దాదాపు పది గ్రామాల ప్రజలు ఈ సర్వీస్ రోడ్డుపైనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పనులు మధ్యలో నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాద భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సర్వీస్ రోడ్డు మరింత కుంగిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి, ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

*** పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో సీతారాంను పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పై లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, గిరిజన రాష్ట్ర నాయకులు రఘునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, శ్రీశైలం గౌడ్, డాకం మనీష్, ముబారక్ అలీ ఖాన్, బాలు నాయక్, రోమియో రమేష్, నాని, లింగాడిగూడ ఉప సర్పంచ్ అశోక్, అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మంగళవారం షాద్ నగర్ చౌరస్తాలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం రాళ్లతో బట్టలు ఊడదీసి కొట్టి చంపాలని ప్రజలను ఇతరులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం శాంతి భద్రతలకు వివాదం కల్పించేలా ఉన్న అతని చర్యలపై పోలీసులు కేసులో నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరారు. శాంతియుత వాతావరణం లో ఉన్న ఈ ప్రాంతాన్ని తన మాటలు ప్రసంగాలతో రెచ్చగొడుతూ సాక్షాత్తు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నే చంపాలని టార్గెట్ గా పెట్టుకుని రెచ్చగొట్టిన తీరు అప్రజా స్వామీకమని ఇలాంటి చర్యలు రాజకీయాల్లో సరికాని వారు పేర్కొన్నారు. వివాదాస్పద వ్యాఖ్యలతో అందరినీ రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ విషయంలో వ్యవహరించిన తీరు ఆక్షేపనియమని దీని ద్వారా కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైందని కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయని శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యాఖ్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. ఈ విషయమై స్థానిక సీఐ సీతారాంను వివరణ అడుగగా ఫిర్యాదు అందిందని ఆయన స్పష్టం చేశారు.

# 20 పేజీల సూసైడ్ నోట్ రాసి విశ్రాంత ఉపాధ్యాయుడి ఆత్మహత్య



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని పూర్ణిమ కాలనీలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. పూర్ణిమ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లయ్య ఆత్మహత్య చేసుకున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పో స్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు ముందు మల్ల య్య 20 పేజీల సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. ఘటనాస్థలంలో లభ్యమై న సూసైడ్ నోట్ను పోలీసులు స్వాధీనం చేసుకుని, అందులో పేర్కొన్న అంశాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.ఆ త్మహత్యకు దారితీసిన పరిస్థితులు ఏ మిటి? సూసైడ్ నోట్లో ఎవరెవరిని ప్రస్తా వించారు? అందులోని ఆరోపణల వాస్త వ పరిస్థితులు ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి.

# డాక్టర్ హెలెన్ కెల్లర్ జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలి

*** అధ్యక్షులు అంజయ్య**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : డాక్టర్ హెలెన్ కెల్లర్ జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఉన్నత విద్యను అభ్యసించాలని అధ్యక్షులు అంజయ్య అన్నారు. డాక్టర్ హెలెన్ కిల్లర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవనంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు చెక్కులను కె. అక్షిత 548, అంజలి548, అమీనా 544, శ్వేతా కుమారి 535, సమ్మరీ బేగం 535 ,మాధురి 489 , అధ్యక్షులు అంజయ్య గౌడ్ , హనుమంతరావు చేతుల మీదుగా అందజేశారు. 6 తరగతి నుండి 9వ తరగతి వరకు ఉత్తీర్ణత పొందిన వారికి కూడా బహుమతులు అందించి అధ్యక్షులు అంజయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హనుమంతరావు, ఝాన్సీ, లావణ్య, టీచర్లు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంఘ సభ్యులు యాదయ్య యాదవ్, నరేందర్ రెడ్డి , సత్యం, వెంకట్రామయ్య, పీజే ప్రకాష్, మట్టయ్య ,శేఖర్ గౌడ్, ఆంజనేయులు, రమ ,సుధాకర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు






# విద్యా విధానం - ఉపాధి
## మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు అవసరం

"విద్య అనేది కేవలం అక్షరాల జ్ఞానం మాత్రమే కాదు, అది వ్యక్తిని ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా, సమర్థుడైన ఉద్యోగిగా తీర్చిదిద్దే ఒక శక్తివంతమైన సాధనం. ఒకప్పుడు డిగ్రీ పట్టా ఉంటే చాలు, ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వచ్చేవి. కానీ, నేటి పోటీ ప్రపంచంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిగ్రీ సర్టిఫికేట్లు అల్మారాల్లో పేరుకుపోతున్నా, పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు గల యువత కరువవుతోంది. 'విద్యా విధానం' మరియు 'ఉపాధి రంగం' మధ్య నెలకొన్న ఈ వైరుధ్యం, ప్రస్తుత విద్యా వ్యవస్థలో మనం చేస్తున్న పొరపాట్లను అద్దం పడుతోంది. మారుతున్న కాలంతో పాటు మనం మారుతున్నామా? లేక పాతబడిన పాఠ్య ప్రణాళికలతో కొత్త సవాళ్లను ఎదుర్కోలేక చతికిలబడుతున్నామా? ఈ వ్యాసం ద్వారా విద్యా, ఉపాధి రంగాల మధ్య ఉన్న ఆ అగాధాన్ని, దాన్ని పూడ్చాల్సిన ఆవశ్యకతను విశ్లేషించుకుందాం."






నేటి ఆధునిక యుగంలో విద్య అనేది కేవలం డిగ్రీ పట్టా సంపాదించడం మాత్రమే కాదు, అది మారుతున్న ప్రపంచంతో అడుగులో అడుగు వేస్తూ నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేసుకోవడం. అయితే, మన దేశంలోని ప్రస్తుత విద్యా వ్యవస్థకు, పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యాలకు మధ్య ఒక పెద్ద అగాధం కనిపిస్తోంది. దీనిపై సమగ్ర విశ్లేషణ:

**1. ప్రస్తుతం ఉన్న ప్రధాన సమస్యలు:**

- సైద్ధాంతిక విద్యకే ప్రాధాన్యత: మన విద్యా సంస్థలు ఇప్పటికీ పుస్తక జ్ఞానానికి (Theoretical knowledge) ఇస్తున్నంత ప్రాధాన్యతను ఆచరణాత్మక జ్ఞానానికి (Practical exposure) ఇవ్వడం లేదు. ఫలితంగా, విద్యార్థులు చదువు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగంలో చేరాక, మళ్ళీ మొదటి నుంచి శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది.
- పాతబడిన పాఠ్య ప్రణాళికలు: సాంకేతికత సెకను సెకనుకు మారుతోంది. కానీ, చాలా కళాశాలల్లో దశాబ్దాల క్రితం నాటి సిలబస్ నే బోధిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు నేటి పరిశ్రమలకు అవసరమైన 'లేటెస్ట్ టెక్నాలజీ'పై అవగాహన పెంచుకోలేకపోతున్నారు.
- నైపుణ్యాల కొరత (Skill Gap): పరిశ్రమలు కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్, క్రిటికల్ థింకింగ్ మరియు ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటి 'సాఫ్ట్ స్కిల్స్'ను కోరుకుంటున్నాయి. కానీ, పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు వీటిని అలవరచుకోవడానికి సమయం కేటాయించలేకపోతున్నారు.

**2. మారుతున్న ఉపాధి రంగం - ఆశిస్తున్న అర్హతలు:**

**నేటి కాలంలో కంపెనీలు కేవలం డిగ్రీ సర్టిఫికేట్‌ను చూసి ఉద్యోగం ఇవ్వడం లేదు. వారు ముఖ్యంగా చూస్తున్నవి:**

- అడాప్టబిలిటీ (Adaptability): కొత్త పరిజ్ఞానాన్ని ఎంత త్వరగా నేర్చుకోగలరు?
- టెక్నికల్ నాలెడ్జ్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డేటా అనలిటిక్స్, కోడింగ్ వంటి విభాగాల్లో ప్రాథమిక అవగాహన.
- కమ్యూనికేషన్ స్కిల్స్: తమ ఆలోచనలను స్పష్టంగా ఇతరులకు చెప్పగలగడం.

3. మనం ఏం చేయాలి? (పరిష్కార మార్గాలు):

- ఇండస్ట్రీ అకాడమియా అనుసంధానం: విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలి. నిపుణులను అతిథి అధ్యాపకులుగా పిలిపించి, పరిశ్రమలో ఏం జరుగుతుందో విద్యార్థులకు తెలియజేయాలి.
- ఇంటర్న్‌షిప్‌ల ప్రాముఖ్యత: డిగ్రీ చివరి సంవత్సరంలో మాత్రమే కాకుండా, విద్యార్థి దశలోనే ప్రతి వేసవి సెలవుల్లో ఏదో ఒక కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం లభిస్తుంది.



- స్వయం అభ్యాసం (SelfLearning): పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్స్ ద్వారా సర్టిఫికేషన్ కోర్సులను పూర్తి చేయాలి. 'నిరంతర అభ్యాసం' (Lifelong Learning) మాత్రమే ఉపాధిని సురక్షితం చేస్తుంది.
- ప్రభుత్వ పాత్ర: నైపుణ్యాభివృద్ధి కేంద్రాల (Skill Development Centers) ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందేలా చూడాలి.

**ముగింపు:**

విద్యార్థి బాగుంటేనే దేశం బాగుంటుంది. ప్రస్తుత విద్యా విధానం కేవలం "ఉద్యోగార్థులను" కాకుండా, "ఉద్యోగ సృష్టికర్తలను" (Job Creators) తయారు చేసే దిశగా అడుగులు వేయాలి. అలాగే, విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న విద్యకు, బయట ఉన్న ఉపాధి అవకాశాలకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించి, తమను తాము నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలి. డిగ్రీ పట్టా అనేది ఒక పునాది మాత్రమే, దానిపై మనం నిర్మించుకునే నైపుణ్యాల సౌధమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది.






## ఇ20 పెట్రోల్‌తో సమస్య వచ్చిన
# ఒక్క కారు చూపించండి: గడ్కరీ



20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల వాహనాల ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తోసిపుచ్చారు. ఇ20 పెట్రోల్ వల్ల సమస్య వచ్చిన ఒక్క కారు పేరు అయినా చెప్పాలన్నారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై కావాలనే విమర్శకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇ 20 పెట్రోల్ వాడకం వల్ల ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. E20 పెట్రోల్ కారణంగా సమస్య ఎదుర్కొంటున్న ఒక్క కారునైనా చూపించండి. ఇథనాల్ బ్లెండింగ్‌పై జరుగుతోన్న ప్రచారం కేవలం పెయిడ్ క్యాంపెయిన్. అందులో వాస్తవం లేదు" అని ఆయన కొట్టిపారేశారు. దేశం ఏటా ఇంధన దిగుమతుల కోసం రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.ఇథనాల్ తయారు చేయాలనే నిర్ణయంతో రైతులకు దాదాపు రూ.45వేల కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు.



# తెల్లారితే బతికేవారు.. అంతలోనే విషాదం

"వర్షాలు కురుస్తున్నాయి. పక్కనే ఉన్న భవనం ఎప్పుడు కూలి మన ఇంటి మీద పడుతుందో తెలీదు. వెంటనే ఇంటికి ఖాళీ చేసి బయటకు వెళ్లాలి" అని ఆ దంపతులు అని అనుకున్నారు. తెల్లారితే వెళ్లాలి కదా అని శనివారం రాత్రి సదరు మహిళ ఇంట్లో సామాన్లు సర్దుతుండగానే ఘోర ప్రమాదం జరిగింది. పక్కనే ఉన్న భవనం కూలి వారి రేకుల ఇంటిపై పడింది. ఈ ప్రమాదంలో కూలీగా పనిచేసే మొయినుద్దీన్ వాజిద్ అలీ షా భార్య అక్తర్ జహాన్, వారి నలుగురు పిల్లలు శిథిలాల కింద చిక్కుకుని మృతి చెందారు. ఘటనకు కొద్దిసేపటి ముందే మొయినుద్దీన్ బయటకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ దారుణ ఘటన ముంబయిలోని మన్‌ఖుర్ద్‌లో చోటుచేసుకుంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పక్కనే ఉన్న భవనం ప్రమాదకరంగా మారిందని అక్తర్ జహాన్ కుటుంబం ముందుగానే గుర్తించిందని స్థానికులు తెలిపారు. ఆదివారం ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని నిర్ణయించుకున్నారని.. ఇంతలోనే దారుణం జరిగిందని కంటతడి పెట్టారు. అయితే భవనం కూలిపోవడానికి కొన్ని గంటల ముందే అందులో నివసిస్తున్న వారు ప్రమాద సూచనలు గమనించారు. దీంతో ఆ భవనంలోని కుటుంబాలు ముందుగానే ఖాళీ చేసి బయటకు వచ్చాయి. మున్సిపల్ అధికారులు కూలిపోయిన భవనం అనధికారిక నిర్మాణమేనని తేల్చారు. దీంతో పోలీసులు భవన యజమానితో పాటు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను అరెస్టు చేశారు.





## అయోధ్య విరాళాల చోరీ కేసు..
# మౌనం వీడిన చంపత్ రాయ్!

అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు కొనసాగుతున్న వేళ.. శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ నోరువిప్పారు. తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పందిస్తానని అన్నారు. ఈ మేరకు ఓ లేఖను విడుదల చేశారు. "రామ మందిరంలో విరాళాల లెక్కింపు సమయంలో చోరీ జరిగిందని జూన్ 6వ తేదీ నుంచి ఎన్నో వదంతులు, చర్చలు జరుగుతున్నాయి. వ్యక్తిగతంగా నా పైనా ఎంతోమంది నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వాటిపై దర్యాప్తు జరుగుతున్నందున ప్రస్తుతానికి మౌనంగా ఉండాలని నిశ్చయించుకున్నా" అని పేర్కొన్నారు. 'సిట్' తుది నివేదిక సమర్పించిన తర్వాతే ఒక్కో అంశంపై స్పందిస్తానని చంపత్ రాయ్ స్పష్టం చేశారు. అప్పుడు వాస్తవాలన్నీ బయటపడతాయని లేఖలో పేర్కొన్నారు. 1991 నుంచి అక్కడే పని చేస్తున్నానని, నాలుగున్నర దశాబ్దాలుగా ప్రచారక్‌గా సేవలందిస్తున్నానని చెప్పారు.



## వలస కార్మికుల
# పిల్లల చెంతకే అంగన్వాడీ సేవలు

హైదరాబాద్: వలస కార్మికుల పిల్లలకు అంగన్వాడీ సేవలను చేరువ చేసేందుకు మొబైల్ అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులు ఉపాధి కోసం ప్రాంతాలు మారుతున్న నేపథ్యంలో వారి పిల్లల కోసం మొబైల్ అంగన్వాడీ వాహనాన్ని ఆయన మంత్రి సీతక్కతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడీ సేవలను అందించనుంది. ఇది విజయవంతమైతే మరిన్ని మొబైల్ అంగన్వాడీలు తీసుకురానున్నారు.

# హీరోలేం దేవుళ్లు కాదు



దక్షిణాది పరిశ్రమలోని స్టార్ కల్చర్‌పై మలయాళ హీరోయిన్ పార్వతి తిరువోతు సంచలన కామెంట్లు చేసింది. "ఇండియన్ సినిమా ఇంటర్నేషనల్ స్థాయికి చేరుకున్నా స్టార్ హీరోలను దే-వుళ్లలా కొలిచే విధానం మాత్రం మారడం లేదు. హీరోలను ఆరాధించే సంస్కృతి నానాటికి పెరుగుతూనే ఉంది. ఈ భావన వల్ల హీరోలు తప్పు చేసినా కూడా వారిని ప్రశ్నించడం కష్టమవు-తోంది. అన్ని ఇండస్ట్రీలలో ఇదే వాతావరణం కనిపిస్తోంది. హీరోల ఆధిపత్య ధోరణి వల్ల కొత్తగా ఇండస్ట్రీలోకి ఎంట రయ్యే వారు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అని తన మనసులో ఉన్న విషయాలను బయటకు కక్కేసింది. ప్రస్తుతం ఈ అందగత్తె తెలుగులో నాగచైతన్యతతో దూత 2 వెబ్‌సిరీస్ చేస్తోంది. మరోవైపు ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఐ నోబడీ మూవీ ఈనెల 10న థియేటర్లలో సందడి చేయనుంది.

# ఈసారి బాలీవుడ్ మూవీలో..

టాలీవుడ్ రియల్ లైఫ్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కాంబినేషన్‌లో ఫస్ట్ టైమ్ ఓ బాలీవుడ్ మూవీ రానున్నట్లు టాక్ నడుస్తోంది. రణబాలి రిలీజ్ కాకముందే విజయ్, రష్మిక మరో మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈసారి తెలుగులో కాకుండా బాలీవుడ్ మూవీలో నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. విక్రమ్ కే కుమార్ దర్శక త్వంలో ఓ బైలింగ్వల్ మూవీ రాబోతుంది. ఇందులో తొలుత కృతి సనన్, శార్వరి, జాన్వీ కపూర్‌తో పాటు మరికొందరు హీరోయిన్ల పేర్లను మేకర్స్ పరిశీలించారట. బాలీవుడ్‌లో ఉన్న సక్సెస్ ట్రాక్‌ను కూడా దృష్టిలో పెట్టుకొని రష్మికనే ఫైనల్ చేశారని సమాచారం. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీని బాలీవుడ్ అగ్ర నిర్మాణ మాడక్ ఫిల్మ్స్ నిర్మించబోతుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు సమాచారం.





సినిమా

# ఓటీటీలోకి సర్దార్.. ఫ్రీ స్ట్రీమింగ్

కార్తీ హీరోగా నటించిన సర్దార్ మూవీ తెలుగుతో పాటు తమిళంలో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. వంద కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. ఈ మూవీ తెలుగు వెర్షన్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలు లేకుండా ఓటీటీలో ఫ్రీగా చూసేయొచ్చు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా కార్తీ వెల్లడించాడు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో రాశీఖన్నా, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించారు. సీనియర్ హీరోయిన్ లైలా ఓ కీలక పాత్రలో కనిపించారు. కార్తీ డ్యూయల్ రోల్‌లో నటించిగా పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించాడు. దేశభక్తి, లవ్, యాక్షన్ అంశాలను జోడించి ఈ సినిమాను రూపొందించారు.



# మొన్నే హీరోయిన్.. అప్పుడే కండీషన్లు

ఫోక్ సింగర్ నాగదుర్గ మొన్నటికి మొన్నే హీరోయిన్ అయింది. అప్పుడే నిర్మాతలకు తెగ కండీషన్లు పెడుతోందట. ఆమె కండీషన్లపై మిస్టర్ మిడిల్ క్లాస్ నిర్మాత చేసిన కామెంట్లు వైరల్ అవుతోన్నాయి. లవ్ ఓ లవ్ మూవీ తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ ఈవెంట్‌లో మిస్టర్ మిడిల్ క్లాస్ నిర్మాత చందు మాట్లాడారు. తమ సినిమాలో ఓ మెయిన్ రోల్ కోసం నాగదుర్గను సంప్రదించాం. సైడ్ రోల్స్ చేయను.. మెయిన్ హీరోయిన్‌గానే నటిస్తానని చెప్పింది. తమ సినిమా ఆఫర్‌ను రిజెక్ట్ చేసింది అని చందు చెప్పాడు. ఇవేకాక ఇదుపుకాయితం మూవీ కోసం సంప్రదిస్తే 15 కండీషన్లు పెట్టిందట. గ్లామర్ రోల్స్ చేయను. కథలో తన పాత్రకు ఇంపార్టెన్స్ ఉండాలి. ఒకరి కంటే ఎక్కువ హీరోయిన్లు ఉంటే తన పాత్రకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి అంటూ షరతులు విధిస్తుందట. కాగా ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళంలో ఓ రెండు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టులు చేస్తుంది ఈ చిన్నది.



# కాజల్ డబుల్ ఎఫర్ట్

హీరోయిన్‌గా కమ్‌బ్యాక్ కోసం కాజల్ అగర్వాల్ తెగ కష్టపడుతోంది. ఓ వైపు షూటింగ్ చేస్తూనే గ్యాప్‌లో తన కొత్త సినిమాను ప్రమోట్ చేస్తోంది. బాలకృష్ణ మూవీ షూటింగ్ బిజీలో ఉంటూనే మరోవైపు తన అప్‌కమింగ్ మూవీ ది ఇండియా స్టోరీని ప్రమోట్ చేస్తుంది. షూటింగ్ బ్రేక్ టైమ్‌లో ఇంటర్వ్యూలు, చిట్‌చాట్‌లలో పాల్గొంటుంది. చాలా మంది హీరోయిన్లు షూటింగ్‌లో ఉంటే ప్రమోషన్స్‌ను స్కిప్ చేస్తుంటారు. కానీ కాజల్ మాత్రం తాను అంగీకరించిన బాధ్యతలను సమర్థంగా పూర్తి చేస్తోంది. ఈ అమ్మడు అంకితభావంపై నెటిజన్లతో పాటు మేకర్స్ తెగ ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా ఈ మూవీకి చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. ఈనెల 24న హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీ రిలీజ్ కాబోతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.